


తెలంగాణభవన్‌లో సోమవారం బీఆర్‌ఎస్ నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎంపీలు కే కేశవరావు, కేఆర్ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, కల్వకుంట్ల కవిత, ఎల్ రమణ, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంజయ్‌కుమార్, వేముల ప్రశాంత్‌రెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్, పార్టీ నేతలు బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, బిగాల గణేశ్‌గుప్తా, రావుల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

# పథకాలు ఆపితే నిలదీస్తం

- ప్రజా సంక్షేమాన్ని సమాధిచేసేలా కాంగ్రెస్ సర్కార్ కుట్రలు
- దళితబంధు లబ్ధిదారుల అకౌంట్లు ఫ్రీజ్
- గృహలక్ష్మి పథకం అన్యాయంగా రద్దు
- పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, మైనార్టీలకు అండగా నిలుస్తాం
- మేము ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందించాం
- కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా పార్టీ ఆచరణ
- నిజామాబాద్ పార్లమెంట్ సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): పేదప్రజల కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం రద్దు చేస్తే ప్రధాన ప్రతిపక్షంగా తమ బాధ్యత నిర్వహిస్తామని, కాంగ్రెస్ సర్కారును ఎండగడతామని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు హెచ్చరించారు. యాభై ఏండ్లపాటు అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్ పార్టీ గతంలో ఎన్నడూ పేద ప్రజల కోసం విప్లవాత్మకమైన, వినూత్న కార్యక్రమాలను అమలు చేసే ఆలోచన చేయలేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన దళిత బంధు, గృహలక్ష్మి, బీసీబంధు, గొర్రెల పంపిణీ వంటి కార్యక్రమాల అమలును నిలిపివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని, సంక్షేమాన్ని సమాధి చేసేలా కుట్ర చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో ఆర్థిక స్వావలంబనకు, అభివృద్ధికి నోచుకోలేని దళిత కుటుంబాల అభివృద్ధి కోసం దేశంలో ఎక్కడా లేనివిధంగా దళితబంధు కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. దళితులను కేవలం ఓటు బ్యాంకుగా చూసిన కాంగ్రెస్, ఎన్నికల సందర్భంగా దళితబంధును రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చిందని అన్నారు. అధికారంలోకి రాగానే కాంగ్రెస్ పార్టీ ఆ హామీని మరచిపోయిందని మండిపడ్డారు. ఇప్పటికే ఎంపికచేసిన దళిత బంధు లబ్ధిదారులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నదని చెప్పారు. లబ్ధిదారులు ప్రారంభించిన బ్యాంకు అకౌంట్లను ప్రభుత్వం ఫ్రీజ్ చేస్తున్నదని ధ్వజమెత్తారు. గొర్రెల పంపిణీ కోసం తమ వాటాలుగా డీడీలు కట్టిన వారిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. నియోజకవర్గానికి 3000 మందికి గృహలక్ష్మి పథకాన్ని అమలు చేయడంలో భాగంగా కేసీఆర్ ప్రభుత్వం లబ్ధిదారులను గుర్తించి వారికి అవసరమైన ప్రొసీడింగ్స్‌ను అందిస్తే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రద్దు చేసిందని మండిపడ్డారు. పేదలు, దళితులు, బీసీల ప్రయోజనాలను దెబ్బకొట్టేలా కాంగ్రెస్ పార్టీ కుట్ర చేస్తే ప్రధానప్రతిపక్షంగా వారికి అండగా నిలుస్తామని చెప్పారు.

### మాట తప్పిన కాంగ్రెస్‌ను ప్రజలు క్షమించరు

ఎన్నికల్లో ప్రయోజనం పొందాలనే ఆలోచనతో, ఎలాగైనా అధికారంలోకి రావాలనే యావతో కాంగ్రెస్ పార్టీ అడ్డగోలుగా వాగ్దానాలు చేసిందని, అధికారంలోకి వచ్చాక శ్వేత పత్రాలు, అప్పుల పేరుతో నాటకాలు ఆడుతున్నదని కేటీఆర్ మండిపడ్డారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇప్పటికే అసెంబ్లీ సాక్షిగా నిరుద్యోగ భృతికి కాంగ్రెస్ హామీ ఇవ్వలేదని అబద్ధాలు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చింది ఆరు గ్యారెంటీలు కాదని, వాటి కింద ఇచ్చింది 420 హామీలని చెప్పారు. వీటి నుంచి తప్పించుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేలా ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు.

### కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా పార్టీ

బీఆర్‌ఎస్ పార్టీకి గెలుపోటములు కొత్తకాదని కేటీఆర్ అన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కన్నా బీఆర్‌ఎస్‌కే ఎక్కువ ఓట్లు వచ్చాయని ఆయన అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వచ్చిన ఓట్లను వివరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉంటుందని చెప్పారు. ఇది బీఆర్‌ఎస్‌కే ప్రయోజనం అని అన్నారు. అసెంబ్లీ ఫలితాలతో సంబంధం లేకుండా తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం రానున్న ఎన్నికల్లో గట్టిగా కొట్లాడితే విజయం బీఆర్‌ఎస్‌దేనని అన్నారు. కేసీఆర్ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణ, బలమైన పార్టీ సైన్యం, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేసిన పథకాలను ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ వంచించే విధానాలతో ప్రజలు పోల్చుకుంటున్నారని అన్నారు. ఎన్నికల్లో పార్టీ పనితీరుపరంగా కూడా కొన్ని మార్పులు చేర్పులు అవసరమని, కార్యకర్తల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ మార్చుకుంటుందని చెప్పారు. తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణ కోసం ఢిల్లీలో గులాబీ జెండా ప్రాతినిధ్యం ఉండాల్సిందేనని అన్నారు. ఇందుకోసం ప్రతి గులాబీ సైనికుడు కష్టపడి పనిచేయాలని చెప్పారు. పార్టీ కార్యకర్తలు అసెంబ్లీ ఎన్నికల ఓటమిని మరచిపోయి పార్లమెంటు ఎన్నికలపై దృష్టిపెట్టాలని అన్నారు. నిజామాబాద్‌తోపాటు అన్ని స్థానాలను బీఆర్‌ఎస్ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో పార్టీ సెక్రటరీ జనల్ కే కేశవరావు, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి, మాజీ స్పీకర్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, ఎల్ రమణ, ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, డాక్టర్ సంజయ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, గణేశ్‌గుప్తా, జీవన్‌రెడ్డి సహా నిజామాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలోని మున్సిపల్ చైర్మన్లు, జడ్పీ చైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### కేసీఆర్ సర్కార్‌లో ప్రజలు లైన్లో నిల్చున్నారా?

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రజలు ఏనాడైనా లైన్లో నిల్చున్నారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రజలు లైన్లలో నిల్చోకుండా ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలను అమలు చేసిన చరిత్ర కేసీఆర్ సర్కార్‌దని చెప్పారు. తాము సంక్షేమ పథకాలను ప్రజలు ఇంటి ముందుకు వెళ్లి అందించామని, అందుకు తమకు గర్వంగా ఉందని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రజలను ఇబ్బంది పెట్టేలా లైన్‌లో నిలబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అస్తవ్యస్థ పనితీరు, పరిపాలనను ఎప్పటికప్పుడు ఎండగట్టేలా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేస్తాయని తెలిపారు.

## కాంగ్రెస్ డ్రామా దర్బార్

- ప్రజావాణిలో పరిష్కరించినవి ఎన్ని?
- వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలి
- సర్కారు మీద మాకు అక్కసు లేదు
- కేసీఆర్ పథకాలను రద్దు చేయడమే కాంగ్రెస్ పార్టీ విధానమా?
- ఆటోడ్రైవర్లకు నెలకు రూ.15 వేలు ఇవ్వాలి: వేముల ప్రశాంత్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్ నెల రోజులుగా నిర్వహిస్తున్న ప్రజావాణిలో ఇప్పటివరకు పరిష్కరించిన అంశాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజాదర్బార్ కాదు దగాదర్బార్, డ్రామా దర్బార్ అని ఎద్దేవా చేశారు. సోమవారం తెలంగాణభవన్‌లో నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశం ముగిసిన అనంతరం వేముల మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలుచేయాలని మాత్రమే కోరుతున్నామని, ప్రభుత్వంపై తమకు అక్కసు లేదని స్పష్టంచేశారు. ప్రగతిభవన్ పేరును ప్రజాభవన్‌గా మార్చిన సీఎం రేవంత్‌రెడ్డి తొలిరోజు అట్టహాసంగా ప్రజాదర్బర్ ప్రారంభించి, ఆ తరువాత రెండు మూడు రోజులు మంత్రులకు, ఆ తరువాత అధికారులకు అప్పగించి, దాన్నొక ప్రహసంగా మార్చారని మండిపడ్డారు. ఈ నెలలో ప్రజావాణిలో ఎన్ని సమస్యలు పరిష్కరించారు? ఎంతమందికి న్యాయం చేశారు? వంటి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాలనను ప్రజల దగ్గరకు చేరుస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి చివరికి ప్రజలను బలిపశువులను చేస్తున్నారని విమర్శించారు.

### ప్రభుత్వం దగ్గర అన్ని వివరాలు

ప్రభుత్వం దగ్గర అన్ని వివరాలు ఉన్నా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడంలో ఆంతర్యం ఏమిటని వేముల ప్రశ్నించారు. ఆసరా పింఛన్లు, రైతుబంధు వంటి పథకాలకు కూడా దరఖాస్తులు స్వీకరించడంలో ఆంతర్యం కాలయాపన చేయడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ పాలనలో పథకాల అమలుకు ప్రజలను ఇలా ఇబ్బంది పెట్టలేదని చెప్పారు. ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. వాటిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఒక్కటే అమలుచేసిందని చెప్పారు. బస్సు సర్వీసులను తగ్గించి మహిళలను ఇబ్బంది పెడుతున్నదని మండిపడ్డారు. ఉచిత బస్సు ప్రయాణంతో ఉపాధి దెబ్బతిన్న ఆటో డ్రైవర్లకు నెలకు కనీసం రూ.15 వేలు ఇచ్చే పథకానికి రూపకల్పన చేయాలని కోరారు. ఆటోడ్రైవర్ల భిక్షాటన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### కేసీఆర్ పథకాలను రద్దు చేయడమే కాంగ్రెస్ విధానమా?

కేసీఆర్ సర్కార్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన పథకాలను రద్దు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానమా? అని వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. పరిపాలనా వికేంద్రకరణ, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసిన జిల్లాల సంఖ్యను తగ్గిస్తామనడం సరికాదని చెప్పారు. ప్రభుత్వ విధానపరమైన అంశాన్ని ప్రభుత్వ వేదిక మీద కాకుండా, మంత్రులతో చర్చించకుండా, అధికారులతో సంప్రదించకుండా ఒక టీవీ చానెల్ డిబెట్‌లో ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. గృహలక్ష్మి, దళితబంధు, గొర్ల పంపిణీ వంటి వాటిని రద్దుచేయడమే కాంగ్రెస్ ఎజెండాగా పెట్టుకున్నదని ఎద్దేవాచేశారు. రేవంత్‌రెడ్డి అసంబద్ధ విధానాలు, అనాలోచిత నిర్ణయాల వల్ల తెలంగాణ ప్రతిష్ఠకు భంగం వాటిల్లుతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ఫార్మాసిటీ, మెట్రోరైల్ అలైన్‌మెంట్ వంటి విషయాల్లో ముందు ఒకటి చెప్పి, ఆ తరువాత మాట మార్చారని ఉదహరించారు. ప్రభుత్వ చేతగానితనం వల్ల ఇప్పటికే ఫార్ములా ఈ-రేస్ రద్దు అయిందని చెప్పారు. వాగ్దానాలు, వాయిదాలు, రద్దులు, ఢిల్లీ పర్యటనలు అన్నచందంగా నెలరోజుల రేవంత్‌రెడ్డి సర్కార్ పాలన సాగిందని ఎద్దేవా చేశారు. డిసెంబర్ 9న రైతుబంధు ఇస్తామని, రుణమాఫీ చేస్తామన్న రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు ఎంతమందికి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

### నెలలో ఆరుసార్లు ఢిల్లీ టూర్ : రమణ

కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఎమ్మెల్సీ ఎల్ రమణ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి అయిన తరువాత నెలరోజులకే ఆరుసార్లు ఢిల్లీకి వెళ్లడం వల్ల తనకు తాను బలహీన సీఎం అని ప్రకటించుకున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేశ్‌గుప్తా, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బండ్ల.. నీ స్థాయి తెలుసుకొని మాట్లాడు

- కేటీఆర్, హరీశ్‌రావును విమర్శించే సీన్ నీకు లేదు
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం



హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): సినీ నటుడు, కాంగ్రెస్ నాయకుడు బండ్ల గణేశ్ స్థాయిని మరిచి మాట్లాడుతున్నారని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం మండిపడ్డారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుపై బండ్ల వ్యాఖ్యలను సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. హరీశ్‌రావును విమర్శించే స్థాయికి బండ్ల గణేశ్‌కు లేదని పేర్కొన్నారు. తెలంగాణ రాజకీయాలతో సంబంధంలేని వ్యక్తికి ఇవన్నీ ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ఎన్నో త్యాగాలు చేసిన గొప్ప చరిత్ర బీఆర్‌ఎస్‌కు ఉన్నదని, అటువంటి పార్టీపై అడ్డగోలుగా ఆరోపణలు చేస్తే తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. పెద్ద నాయకులను విమర్శిస్తే పెద్దవాడిని అవుతాననే భ్రమతో బండ్ల మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తీన్మార్‌పై ఇజ్జత్ దావా వేస్తాం

- అసత్యప్రచారమే కాంగ్రెస్ విధానమా?
- నీలిమకు 1992లోనే ఉద్యోగం వచ్చింది
- అప్పుడు బీఆర్‌ఎస్ పార్టీ సర్కార్ ఉందా?
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మండిపాటు

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): తనపై, తన కుటుంబసభ్యులపై కాంగ్రెస్ నేతలు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, బొల్లం మల్లయ్యయాదవ్, పార్టీ నేతలు క్యామ మల్లేశం, దరువు ఎల్లన్న, తుంగ బాలు తదితరులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తన సతీమణి నీలిమపై కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) అసత్యప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నీలిమ తన ఉద్యోగానికి రాజీనామా చేశారని, అంతకుముందు బీఆర్‌ఎస్ సర్కార్‌లో దొడ్డిదారిన ఆమె ఉద్యోగం సంపాదించారని మల్లన్న పేర్కొనటాన్ని పల్లా తీవ్రంగా ఖండించారు. ఉమ్మడి రాష్ట్రంలో నిర్వహించిన ఎంసెట్‌లో స్టేట్ ర్యాంకు సాధించిన నీలిమ 1992లోనే ఏపీఎస్‌ఈబీలో ఉద్యోగం తెచ్చుకున్నారని, అప్పుడు బీఆర్‌ఎస్ సర్కార్ ఉందా? అని ప్రశ్నించారు. 2015లోనే డివిజనల్ ఇంజినీర్‌గా పదోన్నతి పొందారని, విద్యుత్తుసౌధ, కల్వకుర్తి, మిర్యాలగూడ తదితర ప్రాంతాల్లో పనిచేశారని చెప్పారు. ఆ తరువాత ఆరు నెలలపాటు డిప్యుటేషన్‌పై రాష్ట్ర సచివాలయంలో కూడా పనిచేశారని తెలిపారు. 2016 నుంచి 2020 వరకు నీలిమ వేతనరహిత సెలవులో ఉన్నారని వివరించారు. 2020 నవంబర్ 19న వీఆర్‌ఎస్ తీసుకొని ప్రస్తుతం తమ అనురాగ్ విద్యాసంస్థలకు సీఈవోగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. తీన్మార్ మల్లన్న సోదరుడు తమ విద్యాసంస్థల వద్దకు వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నాడని చెప్పారు. తమ విద్యాసంస్థల్లో అక్రమాలు లేకపోయినా ఉద్దేశపూర్వకంగా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తమ కుటుంబంపై చేసిన అసత్యప్రచారానికి పరువునష్టం దావా వేస్తామని చెప్పారు.



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

### మల్లన్నపై ప్రజావాణిలో ఫిర్యాదులు

'కాంగ్రెస్ అధికార ప్రతినిధి హోదాలో తీన్మార్ మల్లన్న పనిగట్టుకొని బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల కుటుంబాలపై అబద్ధాలు ప్రచారం చేయటమే విధానంగా పెట్టుకున్నారా? దీనిపై కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలి' అని పల్లా డిమాండ్ చేశారు. తీన్మార్ మల్లన్న తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఇటీవలి ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు వచ్చాయని వాటిపై ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకుంటుందా? లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని, తనపై జనగామలో పోటీచేసి ఓడిపోయిన అభ్యర్థి అధికారులను బెదిరిస్తూ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ఆరోపించారు. అనురాగ్ యూనివర్సిటీకి ఇంటెలిజెన్స్ అధికారులు వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు.

### కక్షసాధింపుకు పాల్పడితే ఊరుకోం: బాల్క

అధికారం చేపట్టిన మరుక్షణం నుంచే కాంగ్రెస్ పార్టీ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. తుంగతుర్తిలో సురేశ్ అనే బీఆర్‌ఎస్ కార్యకర్తను, ఆయన భార్యను కాంగ్రెస్ వాళ్లు కొట్టారని, కొల్లాపూర్ నియోజకవర్గంలో మరో కార్యకర్తను హత్యచేశారని తెలిపారు. గోదావరి పరీవాహక ప్రాంత నేతలకు ప్రాణహాని ఉన్నదని, వారి గన్‌మెన్లను ఉపసంహరించడం కక్షపూరిత చర్య అని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ నేతల ఫోన్లను ట్యాప్‌చేసి వింటున్నారని ఆరోపించారు.

## డీజీపీ గారూ.. నా బిడ్డలకు దిక్కెవరు?

- నా భర్త హత్యకు సూత్రధారులను వెంటనే అరెస్టు చేయండి
- చంపించినోళ్లు బయటనే తిరుగుతున్నారు
- బీఆర్‌ఎస్ నేత మల్లేశ్ భార్య నిర్మల వినతి
- ప్రజాస్వామ్యంలో హత్యా రాజకీయాలకు తావులేదు : బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు



డీజీపీకి వినతిపత్రం అందించి మీడియాతో మాట్లాడుతున్న కొల్లాపూర్‌లో హత్యకు గురైన బీఆర్‌ఎస్ నేత మల్లేశ్ భార్య నిర్మల. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు మల్లయ్యయాదవ్, చల్లా ధర్మారెడ్డి తదితరులు

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): 'నా భర్త మల్లేశ్ ఆర్మీలో మాజీ అధికారి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆయనను హత్యచేశారు. బీఆర్‌ఎస్‌లో చురుగ్గా పాల్గొంటున్నాడని, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పనిచేయలేదని కక్షగట్టి భూవివాదం పేరుతో నా భర్తను నరికి చంపారు. ముగ్గురిని అరెస్టు చేసినా ప్రధాన సూత్రదారులు గంట్రావుపల్లి సర్పంచ్ చిన్నయ్య, ఎంపీటీసీ భర్త లక్ష్మారావు, నారాయణపల్లికి చెందిన బారయ్యను పోలీసులు అరెస్టు చేయలేదు. కాంగ్రెస్ ఎమ్మెల్యే, రాజకీయ నాయకుల ప్రోద్బలంతోనే వారి జోలికి పోలీసులు వెళ్లడం లేదు. కాల్‌డాటాను పరిశీలించినా హత్యలో వారి పాత్ర తెలుస్తుంది. డీజీపీ గారూ.. మీరైనా నాకు, నా ఇద్దరు బిడ్డలకు న్యాయం చెయ్యాలి' అంటూ కొల్లాపూర్‌లో ఇటీవల హత్యకు గురైన మల్లేశ్ భార్య నిర్మల డీజీపీ రవిగుప్తా వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. తన భర్త హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ బిడ్డలు, కుటుంబసభ్యులతో కలిసి ఆమె సోమవారం డీజీపీ రవిగుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ధర్మారెడ్డి, బొల్లం మల్లయ్యాదవ్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ పాల్గొన్నారు. తెలంగాణలో హత్యా రాజకీయాలకు తావులేదని డీజీపీ పేర్కొన్నారు. మల్లేశ్ హత్యపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశాస్తామని, నిందితులను చట్టపరంగా శిక్షిస్తామని చెప్పారు.

### ముమ్మాటికీ ఇది రాజకీయ కక్ష

తన భర్త మల్లేశ్ బీఆర్‌ఎస్‌లో యాక్టివ్‌గా ఉంటూ స్థానికంగా గొర్ల పెంపకం సంఘంలో కీలకంగా పనిచేశారని, ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు కక్షగట్టి తన భర్తను ఈ నెల 29న దారుణంగా హత్యచేశారని నిర్మల ఆరోపించారు. డీజీపీకి వినతిపత్రం అందజేసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తన భర్తను హత్య చేయించినోళ్లు గ్రామాల్లో స్వేచ్ఛగా తిరుగుతున్నారని, వారిని అరెస్టు చేయాలంటూ పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగినా, రెండు రాత్రులు పోలీస్‌స్టేషన్‌లోనే జాగారం చేసినా ఉపయోగం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

### రాజకీయ ఒత్తిళ్ల వల్లే పేర్లు తప్పించారు: చల్లా

కొల్లాపూర్‌కు చెందిన స్థానిక నేతల ప్రోద్బలంతోనే పోలీసులు ముగ్గురి పేర్లు తప్పించారని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆరోపించారు. సమగ్ర విచారణ చేపట్టి వారిని కూడా అరెస్టు చేస్తామని డీజీపీ హామీ ఇచ్చారని చెప్పారు. గ్రామాల్లో కాంగ్రెస్ యుద్ధ వాతారణాన్ని సృష్టించిందని, బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడులకు ప్రోత్సహించడం సరైంది కాదని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ కార్యకర్తలపై దాడులు, ఆస్తుల ధ్వంసం వంటివి నిత్యం జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. హత్య జరిగితే ప్రభుత్వం నిందితులకు కొమ్ముగాయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి సీఎం ఉన్న రేవంత్‌రెడ్డి ఇట్లాంటి వాటిని ఆదిలోనే అరికట్టాలని కోరారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సొంత నియోజకవర్గంలో దేశానికి సేవచేసిన జవాన్‌ను హత్య చేయడం సిగ్గుచేటని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ హయాంలో తెలంగాణ ప్రశాంతంగా ఉన్నదని, ఎక్కడా ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కూడా ఇబ్బంది పడలేదని చెప్పారు. హత్యా రాజకీయాలను విడనాడి, శాంతిభద్రతలను కాపాడలేకపోతే దెబ్బకు దెబ్బ తీస్తామని కాంగ్రెస్ నేతలను హెచ్చరించారు.

### ప్రణాళిక ప్రకారమే హత్య: సతీశ్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ జిల్లాలో బీఆర్‌ఎస్ నేత, ఆర్మీ మాజీ ఉద్యోగి మల్లేశ్‌ను కాంగ్రెస్ పార్టీ ప్రణాళిక ప్రకారం హత్య చేసిందని రెడ్కో మాజీ చైర్మన్ వై సతీశ్‌రెడ్డి ఆరోపించారు. ఈ దారుణహత్యను అందరూ ఖండించాలని కోరుతూ ట్వీట్ చేశారు. తమ కుటుంబానికి న్యాయం జరగాలంటూ మల్లేశ్ భార్య చేస్తున్న ఆర్తనాదాలు దేశవ్యాప్తంగా ప్రతిధ్వనించాలని, వారికి మద్దతుగా నిలువాలని విజ్ఞప్తి చేశారు.

## లోకం పోకడ




ఆ ప్రాజెక్టుకు 'అదానీ' పేరు పెడితే తప్పక ఇచ్చేవారేమో?!

## టీటీడీ వెబ్‌సైట్ పేరు మార్పు

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తన అధికారిక వెబ్‌సైట్ పేరును మరోసారి మార్చింది. ఇప్పటివరకు ఈ వెబ్‌సైట్ పేరు thirupathibalaji.ap.gov.in అని ఉండేది. దానిని ttdevasthanams.ap.gov.in అని మారుస్తున్నట్టు సోమవారం టీటీడీ అధికారులు ప్రకటించారు. 'వన్ ఆర్గనైజేషన్, వన్ వెబ్‌సైట్, వన్ మొబైల్ యాప్'లో భాగంగా బుకింగ్ వెబ్‌సైట్‌నూ మార్చామన్నారు.

### తిరుమలలో 16న ఆర్జిత సేవలు రద్దు

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16న పార్వేట, గోదాపరిణయోత్సవాల కారణంగా స్వామివారి ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. సంక్రాంతి ని పురస్కరించుకొని తిరుపతి గోవిందరాజస్వామి వారి ఆలయంలో 14న భోగితేరు, 15న సంక్రాంతి తిరుమంజనం, 16న గోదాకల్యాణం నిర్వహిస్తారు.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| మెదక్ | 11.1°c | 30.1°c |
| ఆదిలాబాద్ | 12.0°c | 32.3°c |
| రంగారెడ్డి | 16.0°c | 31.6°c |
| నల్లగొండ | 16.4°c | 31.9°c |
| మహబూబ్‌నగర్ | 17.0°c | 30.2°c |
| నిజామాబాద్ | 17.7°c | 30.4°c |
| వరంగల్ | 17.5°c | 30.0°c |
| కరీంనగర్ | 18.0°c | 30.0°c |
| హైదరాబాద్ | 18.0°c | 20.0°c |
| ఖమ్మం | 18.0°c | 30.0°c |

## నిపుణ
విద్య, ఉద్యోగ సమాచారం

### యునైటెడ్ ఇండియాలో...

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 250
- పోస్టులు: అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (జనరలిస్ట్)
- అర్హతలు: కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత, కంప్యూటర్ నాలెడ్జ్ తప్పనిసరి
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 23
- వెబ్‌సైట్: https://uiic.co.in

### సాహిత్య అకాడమీలో..

కేంద్ర ప్రభుత్వ సంస్థ సాహిత్య అకాడమీలో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 10
- పోస్టులు: టెక్నికల్ అసిస్టెంట్, సేల్స్ కమ్ ఎగ్జిబిషన్ అసిస్టెంట్, రిసెప్షనిస్ట్ తదితరాలు
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- చివరితేదీ: ఫిబ్రవరి 5
- వెబ్‌సైట్: https://sahitya-akademi.gov.in

### ఇఫ్లూలో..

హైదరాబాద్‌లోని ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో కింది కోర్సుల్లో ప్రవేశానికి ప్రకటన విడుదలైంది.

- కోర్సు: ప్రొఫిషియన్సీ కోర్స్ ఇన్ ఇంగ్లిష్
- సీట్ల సంఖ్య: 200
- కోర్సు వ్యవధి: 40 గంటలు
- అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 31
- వెబ్‌సైట్: https://www.efluniversity.ac.in/

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- గ్రూప్స్ ప్రత్యేకం ఎకానమీ, ఐఐటీ నీట్ ఫౌండేషన్ కెమిస్ట్రీ, టెట్ పేపర్ స్పెషల్ మ్యాథ్స్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.